
**టుబీ ఆర్ నాట్టుబీ - యిది అనాదిగా వస్తున్న ప్రశ్న. చేయవలసిన,
చేయాలనుకున్న ప్రతి పనికీ కనీసం రెండు ప్రత్యామ్నాయాలున్నపుడు,
యెన్నుకునే స్వేచ్ఛ వున్న మనిషి దేన్ని యెన్నుకుంటాడన్నది
అతడి వ్యక్తిత్వం పైన ఆధారపడి వుంటుంది. బరువు బాధ్యతల నుంచి
జాగ్రత్తగా తప్పించుకుని తన స్వార్థమూ, సంతోషాలు మాత్రమే ముఖ్యమనుకునే
మనుషులే చాలా యెక్కువగా వుంటారు. వాళ్ల జీవితాల గమనమూ,
వాళ్లు చివరికిచేరే గమ్యమూ యెలావుంటున్నదన్నదే విచికిత్స.**


మధురాంతకం నరేంద్ర

11

# అతడు నడచిన దారి

చారి పి.ఎస్.





తనను పరీక్ష చేశాక, తెర కవతలికెళ్లాడు డాక్టరు.

"ఆపరేషన్ చేయాలనుకుంటే రెండు రోజుల్లోపల చేయాలి. వద్దనుకుంటే యిప్పుడే యింటికెళ్లిపోవచ్చు. ఆపరేషను చేస్తే యెక్కువ రోజులు బతుకుతాడో, చేయకుండా యిలాగే వదిలిపెడ్తే యెక్కువ రోజులు బతుకుతాడో చెప్పలేం. అంతా లక్ పైనే ఆధారపడివుంది. ఆ పైన మీ యిష్టం," తనకు వినబడాలనే పెద్దగా చెప్తున్నాడు డాక్టరు. టూబీ ఆర్ నాట్టుబీ- అదీ ప్రశ్న. కొడుకేం చెప్తాడోనని చెవులు రిక్కించి విన్నాడతను.

"అంతా కలిసి మాట్లాడుకున్నాక డెసిషన్ తీసుకుంటాం సార్! కొంచెం టయమివ్వండి," కొడుకు గొంతు జీరబోతోంది.

"అది మీ యిష్టం. వీలయినంత త్వరగా చెప్పాలి మీరు. ఆపరేషనయితే యెల్లుండి చేసెయ్యాలి. చేస్తే ప్రమాదం ముంచుకు రానూవచ్చు. చేయకపోతే యింకొన్ని రోజులు యెక్కువగా బతకనూ వచ్చు. చేయకపోతే డేంజరులో పడే ఆస్కారమూ వుంది..."

కొడుకు నీరసంగా తెర కివతలికొచ్చి, "అదే ట్రీట్‌మెంటు కంటిన్యూ చేయమన్నారు నాన్నా! మరునాటికి యింకో లెగ్ కీమోతెరపీ చెయ్యాలన్నాడు," అన్నాడు. అతుకుతున్నట్టు అబద్ధం చెప్తున్న కొడుకుకేసి చూస్తూ నీరసంగా నవ్వడానికి ప్రయత్నించాడతను.

అతడి ముఖంలో తెల్లటి ముళ్లలా పెరిగిన వెంట్రుకల మధ్యలోంచి కన్నీటి చార పాకుతోంది. తెరకవతలి కెళ్లిన కొడుకు తన భార్యతో యేదో సణుగుతున్నాడు. వాళ్లు కావాలని తనకు వినబడేలా గొణుగుతున్నారని అనుమానం కలుగుతోం దతడికి. ఆ విద్యలో వాళ్లింత నిపుణులెప్పుడయ్యారని ఆలోచించే స్థితిలో

లేడతను. ఆపరేషన్ చేస్తే ఆ దొంగ జబ్బు త్వరగా అల్లుకుపోయి ముగింపును మరింత దగ్గరికి తేవచ్చు. లేకపోతే ముగింపును మరింత ఆలస్యం చేయొచ్చు. ఆపరేషన్ చేయకపోతే అదే ముగింపు త్వరగానే ముంచేయొచ్చు. ఆపరేషన్ వద్దనుకుంటే మరింత యెక్కువకాలం బతకనూవచ్చు. యేం చేస్తే యేమవుతుందో డాక్టరే తేల్చుకోలేకపోతున్నాడు. కానీ నిర్ణయమేదో తీసుకోక తప్పదు. యెవరు తీసుకుంటారు? డాక్టరు బంతిని యివతలి కోర్టులోకి విసిరేసి వెళ్లాడు.

దాదాపు ముప్పయ్యేళ్ల క్రితం తానొక నిర్ణయాన్ని తీసుకోకుండా వుండి వుంటే డాక్టరు తన పరిస్థితిలోనూ, తాను డాక్టరున్న స్థానంలోనూ వుండే వాడినేమో గదా, అనుకున్నాడతను. అయితే ఆ నిర్ణయానికీ, తన శరీరంలో వచ్చిన మార్పుకూ సంబంధమేముంది? దానికదే, దీనికిదే, అనుకున్నాడు. కాస్సేపటి తర్వాత, అదేయిదీ, యిదే అదీ గావచ్చుగదా, అని కూడా అనుకున్నాడు. నీరసంగా తలగడ పైన వాలి కళ్లు మూసుకున్నాడు. అప్పుడు తానొప్పుకుని వుంటే ప్రభావతినిచ్చి పెళ్లి చేయడానికి తన మేనమామ యెగిరి గంతేసి వుండేవాడు. అయితే ఆ మేనమామ మామూలు బడిపంతులు. ప్రభావతి ప్రైవేటుగా బియ్యే చేసి బియ్యీడీ చేయడం కోసం కాలేజీలు వెతుక్కుంటోంది. సరిగ్గా అప్పుడే సంధ్య సంబంధం వచ్చింది. వాళ్ల నాన్నది కమీషను వ్యాపారం. నగరంలో మూడిండ్లు, రెండు కార్లు. వొక కొడుకూ, వొక కూతురూ సంతానం. వున్న ఆస్తిని పిల్లలిద్దరికీ సమానంగా రాసిస్తానంటున్నాడు. ప్రభావతా? సంధ్యా?

*సంధ్య ప్రభావతిలా చదువుకోలేదు. ప్రభావతి సన్నగా, పొడుగ్గా, యెర్రగా నాజూగ్గా వుంటుంది. సంధ్య పొట్టిగా, చామనచాయలో కాస్త బొద్దుగా వుంటుంది. కాలం కలిసొస్తే ప్రభావతి స్కూలు టీచరై, ప్రతి నెలా జీతం తెచ్చుకునే అవకాశం వుంది. కానీ సంధ్యకిప్పటికే లక్షల ఆస్తి వుంది. చిన్నప్పటి నుంచీ బంధువులంతా ప్రభావతే నా భార్యని చాటింపేసేశారు. అత్తామామా నాపైన్నే ఆశలు పెట్టుకున్నారు. ప్రభావతి గూడా నేనంటే తనకిష్టమని స్పష్టంగానే సూచించింది. కానీ సురక్షితమైన దారిని వదిలిపెట్టి అనవసరమైన రిస్కు తీసుకోవడమెందుకు?*

బూట్లు పెద్దగా శబ్దం చేస్తుండగా హడావుడిగా డాక్టరు మళ్లీ తన బెడ్ దగ్గరికొచ్చాడు. పెద్ద పనిమీద వచ్చినవాడిలా ప్రిస్క్రిప్షన్ పేడ్ తీసుకుని యేదో రాశాడు. తర్వాత, "మీ అబ్బాయేం చెప్పాడు? సాయంత్రంలోగా డెసిషన్ చెప్పమని చెప్పండి," అని చెప్పేసి, యింకేదో పని ముంచుకొచ్చినట్టుగా చకచకా వెళ్లి పోయాడు.

*ప్రభావతికి టీచరుద్యోగమంత సులభంగా దొరుకుతుందను కోలేదు. యీ డాక్టరు సంబంధం వెతుక్కుంటూ వస్తుందనీ అనుకో లేదు. మళ్లీ చదువుకుని ఆవిడ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాల్‌దాకా యెదుగుతుందని యెవరూ వూహించలేదు. ఆవిడిప్పుడు రిటైరై దర్జాగా విశ్రాంతి తీసుకుంటూ వుంది. రిటైర్‌మెంటు లేని ప్రైవేటు ప్రాక్టీసుతో యీ డాక్టరు జబర్దస్తీగా వున్నాడు. నేను రిస్కు తీసుకుని ప్రభావతిని పెళ్లి చేసుకుని వుంటే యేమయివుండేది? యిద్దరూ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాళ్లుగా రిటైరై వుండేవాళ్లు మహా అయితే. కానీ నేనింత స్థితిమంతుడై వుండేవాణ్నిగాదు.*

మామగారిచ్చిన ఆస్తిని అతను పాడు చేయలేదు. రిస్కుండే వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టలేదు. రేటు పెరుగుతుందని నమ్మకముండే రియలెస్టేటులో రిస్కు లేనంత పెట్టుబడి మాత్రమే పెట్టాడు. సగం ఆస్తిని వారసత్వంగా పొందిన అతడి బావమరిది తండ్రిచ్చిన ఆస్తిని మూడింతలు చేసుకున్నాడు. కానీ ఆ బావమరిదిలా బతుకంతా పరుగుల్లో పడి అలసిపోనందుకు అతడెప్పుడూ తనని తాను మెచ్చుకునే వాడు.

కర్టెను కవతల వైపున బెడ్ పైకి కొత్త పేషంటొచ్చినట్టున్నాడు. అతనితో బాటు పెద్ద గుంపే వచ్చింది. స్థలం చాలకపోవడంతో మధ్యలో అడ్డంగా వున్న తెరనెవరో పక్కకు తోసేశారు. బెడ్‌పైనున్న ముసలాయన రోగిలా బిక్కుబిక్కు మంటూ లేడు. షికారుకొచ్చిన వాడిలా వుత్సాహంగా కబుర్లు చెబుతున్నాడు.

"అరరే! నువ్వా నాయనా! యేమిటి జబ్బు?" అని తనను పలకరిస్తున్నాడు గూడా.

యెప్పుడో హైస్కూల్లో తనకు పాఠం చెప్పిన లెక్కల మాస్టార్ని వెంటనే గుర్తుపట్టేశాడతను. ఆ టీచరప్పుడు జనరల్ మాత్స్ చెప్పేవాడు. యెనిమిదో తరగతి కెళ్తూనే అమ్మా నాన్నా, 'నీకు లెక్కలు బాగా వచ్చుగదా! కాంపోజిట్ తీసుకో,' అన్నారు. అతను వినకుండా జనరలే తీసుకున్నాడు. మూడు నెలలపాటూ అతడికి జనరల్ మాత్స్ పాఠాలు చెప్పిన లెక్కల టీచరు- యిప్పుడిలా తయారైన ముసలాయిన- 'నీకు లెక్కలు చురుకుగా వస్తున్నాయిరా! కాంపోజిట్‌కు మారు,' అని గట్టిగానే చెప్పాడు.

*లెక్కలు బాగా వచ్చినంతమాత్రాన కాంపోజిట్ తీసుకుని బుర్ర అరిగిపోయేలా రోజంతా వాటితో కుస్తీ చేయడమెందుకు? జనరల్ అయితే త్వరగా లెక్కలు చేసేసి, మిగిలిన సమయమంతా ఆట పాటల్తో గడపచ్చు గదా! ఆ లెక్కలేవో స్కూల్లోనే చేసేసి, యింటి కొచ్చాక స్నేహితులతో కలిసి కోతీకొమ్మలూ, బొంగరాలు, కబడ్డీ, యేదయినా ఆడుకోవచ్చు. వీళ్లిలాగే సతపోరితే, ఆ జనరల్ లెక్కల్ని కావాలని తప్పుగా చేసి, మొద్దని పేరు తెచ్చేసుకుంటానంతే! పాసు కావల్సినన్ని మార్కులు మాత్రం వస్తే చాలదా? అనవసరంగా నూటికి నూరు మార్కులెందుకు తెచ్చుకోడం? మార్కులేమైనా ఆకుకూరా, పుల్లగూర చేసుకోడానికి? పరిగెత్తి పాలు తాగడం కంటె, నిలబడి నీళ్లు తాగడమే మేలు.*

ముసలాయిన రెండు ఆపిలు పళ్లను తనకివ్వమని తన పక్కన నిల్చున్న వ్యక్తికి చెప్తున్నాడు. వొక పండునలాగే కట్టుడుపళ్లతో పరపరా నములుతూ, "నాకు కేన్సరంటున్నాడు డాక్టరు. తొంభైయేళ్లు. యీ బొంది పోవడానికేదో నింద గావాలి. యీ ఆస్పిటలూ, మందులూ వొద్దు, యింట్లోనే వుంటానంటే యీ పిల్లలు వినడం లేదు," అని తనకేదో లాటరీ తగిలినంత ఆనందంగా నవ్వసాగాడా ముసలాయిన.

*నాకంటే తక్కువ తెలివితేటలున్న వాళ్లు కొందరు కాంపోజిట్ తీసుకుని, తర్వాత యింజనీర్లయ్యారు. యేవేవో వుద్యోగాలు చేసి రెండుచేతులా సంపాదించారు. ఆ సంపాదన కోసం వాళ్లు తమ*

*జీవితాల్ని పణంగా పెట్టేశారు. ఆ పోటీలో పడి పరిగెత్తి, పరిగెత్తి అలిసిపోయారు. వాళ్లకు క్లబ్బులూ, పార్టీలు తెలియవు. రోజులకు రోజులు, సంవత్సరాలకు సంవత్సరాలు క్లబ్బులో రెమ్మీలూ, బ్రిడ్జిలూ ఆడుతూ గడిపేశాను జల్సాగా. దాంతోబాటూ కావల్సిన విందులూ, చిందులూ అన్నీ దొరికేవి అక్కడ సులభంగా.*

పండు తిన్నాక, గ్లాసెడు కాఫీ తాగి పక్క బెడ్డు ముసలాయిన దిగులూ వ్యసనం లేకుండా గుర్రు పెడుతున్నాడు. ఆయనతోబాటు వచ్చిన గుంపునంతా నర్సులు బయటికి తోలేశారు. రెండు మంచాల కవతలున్న పేషంటును పలకరించ డానికొచ్చిన విజిటరు తనని చూడగానే, "మీరా మేష్టారూ! యెన్నాళ్లనుంచీ యిలా? డాక్టరేమంటున్నాడు?" అంటూ అతడ్ని పలకరించాడు.

"నువ్వా బాబూ! బాగానే వున్నాలే..." అన్నాడతను కంగారుగా.

తర్వాత, "నువ్వొక్కడివే వచ్చావా? ఝాన్సీ రాలేదా?" అని అడిగాడు తడబడుతూ.

"లేదండీ! ఆమెకెక్కడ తీరుతుందీ? యిప్పుడు రణస్థలం ర్యాలీలో వుంటుంది. యీ దేశంలో యిబ్బందులు లేని వాళ్లెవరు? యెక్కడేం గొడవ జరిగినా యీవిడక్కడికి చేరిపోతుంది. మధ్యలో యెప్పుడైనా పొరబాటున తీరిక దొరికితే అప్పుడు మొగుడనే వాడొకడున్నాడని ఆమెకు జ్ఞాపకం వస్తుంది. అందాకా నేనిలా ఆమె పురమాయించే పనులు చేసుకుపోవాలి," అంటూ పరవశంగా నవ్వుతున్నాడా మనిషి.

తాను బ్రహ్మచారిగా వుద్యోగం చేస్తూ నగరంలో గడిపిన రోజులూ, అప్పుడక్కడ ఝాన్సీతో యేర్పడిన పరిచయమూ గుర్తుకొచ్చాయతడికి. ఝాన్సీ కప్పటికే పెళ్లయ్యింది. ఆ మొదటి మొగుడు యేదో కార్మికుల సంఘంలో లీడరు. ఆ సంఘం పనులతో యెప్పుడూ వూర్లు తిరిగేవాడు. వొంటరిగా యింట్లో వేగుతుండే ఝాన్సీతో స్నేహం కుదరడం, ఆ స్నేహం 'లివింగ్ టుగెదర్' అనే బంధంగా మారడం, అంతా కలలా జరిగిపోయింది. యెప్పుడో నెలకో రెండు నెలలకో వచ్చే ఆ మొగుడున్న రెండు మూడు రోజులు తప్ప మిగిలిన రోజులంతా

అతడు ఝాన్సీ యింట్లోనే వుండేవాడు. యిరుగుపొరుగులూ, స్నేహితులు యేమనుకుంటారన్న ఆలోచనయినా రాని తన్మయమది. యింతలో యేదో ప్రమాదంలో ఆ మొగుడు పోయాడు. వీళ్లకు లైన్ క్లియరయ్యింది లెమ్మనుకున్నారందరూ. మొగుడు పోయిన తర్వాత ఆరు నెలలపాటు విషాదయోగంలో మునిగిపోయి, అతడ్ని పట్టించుకోని ఝాన్సీ ఆ తరువాత, 'యెప్పుడు పెళ్లి చేసుకుందాం?' అని అడగనే అడిగేసింది. యెదురుచూడని ఆ ప్రశ్నకు బెదిరి పోయిన అతగాడు నెలరోజుల సెలవుపైన పారిపోయాడు. తిరిగొచ్చాక ఆ యింటి వైపుకైనా వెళ్లలేదు.

*యీ వయస్సులో యీ ఆనందం కోసం వెంపర్లాడడం సహజమే గానీ, అది యింత సులభంగా, యింత అనుకూలంగా దొరుకుతుందనుకోలేదు. యిలా యెన్నాళ్లయినా గడిపే వుండేవాడు. కానీ పెళ్లి అంటుందేమిటి? పెళ్లంటే యెన్ని బరువులూ, బాధ్యతలూ! ఆవిడ స్వభావం నాకు బాగా తెలుసు. ఆమెకూ తనకూ కుదరదు. ఆ మొగుడు పోయాక ఆ ఆరునెలలూ యేడుస్తూ నాకు దూరంగావడం మేలే చేసింది. లేకపోతే యీ అలుసు తీసుకుని ఆమె వుచ్చు బిగించేసేది. యిప్పుడీవిడ బారినుంచీ తప్పించుకోవడమెలాగన్నదే నా సమస్య.*

సెలవును పొడిగించుకున్నాక, యెవరెవరినో ప్రాధేయపడి ఆ వూరి నుంచి బదిలీ చేయించుకున్నాడతను. ఆవిడ తనతో మాట్లాడడానికి చేసిన ప్రయత్నాలన్నీ తెలివిగా తప్పించుకున్నాడు. ఆ యిబ్బందుల్ని పూర్తిగా వదిలించుకోడానికే త్వరగా పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత ఝాన్సీకి కాంపెన్‌సేషన్ కింద ఆ మొగుడు చేస్తున్న వుద్యోగమే యిచ్చారని తెలిసింది. ఆవిడ ఆ మొగుడి వుద్యమాల్లోకే దూకేసిందట! కొన్ని సంవత్సరాల తర్వాత ఆమె తనకంటే చిన్నవాడైన యువకుడ్ని పెళ్లి చేసుకుందనీ, ఆ రెండో మొగుడు ఆవిడకో పర్సనల్ అసిస్టెంటుగా మారి పోయాడనీ చెప్పారెవరో. చాలా సంవత్సరాల తర్వాత ఝాన్సీ వాళ్ల వూరికొచ్చినప్పుడు ఆ రెండో మొగుడితోబాటూ వచ్చి అతడ్ని పరామర్శించింది. ఆవిడ

మాట్లాడుతున్న ధోరణి జూస్తే ఆ రెండో మొగుడికి తమ సంబంధాన్ని గురించి అంతా తెలిసినట్టే వుందనిపించిందతడికి. కానీ ఆ రెండో మొగుడా విషయాన్నంతగా పట్టించుకోవడం లేదు. అంతా వింటున్న తన పెళ్లానికి తన పాత కథ తెలిసి పోతుందేమోనని అతను మాత్రం బెంబేలెత్తిపోయాడు.

*జరిగిపోయిన సంగతులనంతా గుర్తుచేస్తూ యీ మనిషి గూడా యిప్పుడే యెందుకొస్తున్నాడు? లోకమంతా కలిసి నాపైన కుట్ర చేస్తోందా యేమిటి? పర్వాలేదు. యెప్పుడూ అప్రమత్తుడిగానే వుంటున్నాన్నేను. ఆ ఝూన్సీ అనే విప్లవకారిణిని పెండ్లాడి, యీ రెండో మొగుడిలా ఆమెకు సెకండ్ ఫిడేల్ వాయిస్తూ ఆ బోడి గొప్ప పేరేదో సంపాదించుకున్నందుకు బోలెడు సంబరపడిపోతూ, యిలా సింద్‌బాద్‌లా దయ్యాన్ని వదిలించుకోలేక మోస్తూ బతికే దురవస్థ తప్పిపోయింది నాకు వెంట్రుకవాసిలో.*

"మీరిలా హాస్పిటల్లో వున్నారని తెలిస్తే ఝూన్సీ తట్టుకోలేదు మాస్టారూ! ఫోను చేసి చెప్పకపోతే వూరుకోదు. నేను వెళ్లనా మరి! యీ వూరి కాలేజీలో యేదో గొడవన్నారు. స్వయంగా వెళ్లి చూసి జరుగుతున్నదేమిటో చెప్పమని యీ వూరికి తరిమింది నన్ను. వెళ్లాలి నేను వెంటనే..." అతను చెప్తూనే వెళ్లిపోయాడు.

విసుగ్గా కళ్లు మూసుకున్నాడతను. పక్క పేషంట్ల దగ్గర సందర్శకులెవరో మాట్లాడుతున్నారు. ఫాన్లు కొన్ని కీచుమంటున్నాయి. అతడికి కడుపులో యెక్కడో మంట పుడుతోంది. అది జబ్బువల్లో, ప్రొద్దుటినుంచీ తనను కలిసిన వాళ్లు మోసు కొచ్చిన విసుగో తెలియడం లేదతడికి.

"ఆపరేషను చెయ్యడమా, మానడమా, నాన్న యెంతకూ చెప్పడంలేదు. యిక నేరుగా అడిగేస్తాను," అంటున్నాడు కొడుకు తెరకవతల యెవరితోనో.

కాస్సేపటి క్రితం మింగిన మాత్రలు అతడిపైన నిద్ర వలను కప్ప బోతున్నాయి.

"నిద్రపోయావా? యెవరొచ్చారో చూడు," అందో గొంతు.

అతను బలవంతంగా కళ్లు తెరిచి, నీరసంగా నవ్వబోయాడు.

"గుర్తు పట్టావా? సుదర్శనంరా! యూనివర్సిటీలో..."

జ్ఞాపకం వచ్చినట్టుగా తలూపాడతను. రీసెర్చిలో చేరినప్పుడు అతడికీ, సుదర్శనానికీ వొకడే గైడు.

“నీకున్నంత సాహిత్య పరిచయం సుదర్శనానికి లేదు. ‘ఆధునిక తెలుగు సాహిత్యం- మార్క్సిజం ప్రభావం’ అదీ నీ టాపిక్,” అన్నాడు గైడు.

కాలక్షేపం కోసం పత్రికల్లో కథలూ నవలలూ చదివాననీ, తనకు సాహిత్య మంటే పెద్ద పట్టింపేమీ లేదనీ అతను గొల్లుమన్నాడు. తాత్విక శాస్త్రాధ్యయనం తన చేతగాదని మొత్తుకున్నాడు. చివరికా అంశం సుదర్శనం పాలబడింది. తాను అదెవరో కవి రాసిన సినిమా పాటలను యెంచుకున్నాడు. సుదర్శనం తన పరిశోధనలో గొంతువరకూ మునిగిపోయి, తర్వాత రీసెర్చి ముగించకుండానే వెళ్లిపోయాడు. యెక్కడో చిరుద్యోగంలో చేరాడన్నారు. తాను మాత్రం రెండేళ్లలో ఆ థీసిస్ యేదో బరికేసి, డాక్టరేటు తెచ్చుకుని, డిగ్రీ కాలేజీ లెక్చరరుగా వుద్యోగం లోకి చేరిపోయాడు. సుదర్శనం అప్పుడు ఆధునికానంతర వాదం పైన వరసగా వ్యాసాలు రాస్తున్నాడు. స్కూలూ, చదువూ, రాయడం తప్ప మరేమీ పట్టించు కోడట! పేరుకైతే పెళ్లాం పిల్లలు వున్నారుగానీ, వాళ్లతోకంటే అతగాడు పుస్తకాలతోనే యెక్కువ కాలం గడుపుతాడని అందరూ అనుకునేవాళ్లు.

*దేని హద్దులేవో తెలుసుకోకుండా గాలితో పోరాటం చేసేవాళ్లలాగే వుంటారు. డిగ్రీ కోసం కాకపోతే రీసెర్చెందుకు? త్వరగా ముగిసే అంశమేదో తీసుకుని, ఆ గైడనే గండం దాటుకుని, పరీక్షకులచేత పర్వాలేదు లెమ్మనిపించుకునే థీసిస్ వొకటి గిలికేసి, త్వరగా తేలికగా వుండే వుద్యోగమేదో సంపాదించుకోవడమే గదా ముఖ్యం. ఆ పరిశోధనన్నదే జీవితాశయమయినట్టుగా, యింకేమీ పట్టించు కోకుండా దాన్లోనే కూరుకుపోతే యిలాగే జరుగుతుంది. డాక్టరేటు రాలేదుగానీ జీవితకాలం నాలుగ్గోడల మధ్య ఖైదీలా కూర్చుని, బుర్రను తొలిచే ఆ పుస్తకాల్ని చిదుగుతూ వుండిపోయాడు. తోటివాళ్లు ప్రతిరోజూ పండుగలా, పిక్నిక్‌లా విలాసంగా గడుపుతూ వుంటే, వీడేమో నిప్పుకోడిలా లావుపాటి ఆ బౌండు పుస్తకాల్లో తల దూర్చుకుని కూర్చున్నాడు.*

“నీకూ నాకూ అయితే రిటైర్‌మెంటుగానీ, మన సుదర్శనానికెక్కడుంది చెప్పు,” అంటున్నాడు అతడ్ని తీసుకొచ్చిన స్నేహితుడు. యిప్పటికీ సుదర్శనం రోజుకు పదిహేను గంటలు పని చేస్తున్నాడట. పెద్దపెద్ద కవులూ రచయితలూ తమ రచనల గురించి సుదర్శనమేం చెప్తాడోనని వేచి చూస్తుంటారట! అదేదో పెద్ద అవార్డు అతడికి రావడం ఆలస్యమైపోయిందని అందరూ వాపోతుంటారనీ, సుదర్శనానికి తన రాతకోతలు తప్ప యింకేమీ పట్టదనీ ఆ స్నేహితుడంటున్నాడు. సుదర్శనం చేసిన పరామర్శ అతడి విమర్శల్లాగే పొడిపొడిగా, విడివిడిగానే వుంది. అతడిచ్చిన సమాధానాలేవో తనకూ సంతృప్తిని కలిగించినట్టుగా ఆ స్నేహితుడు సుదర్శనంతోబాటు వెళ్లిపోయాడు.

తాపీగా వార్డులోకి నడిచొచ్చిన కొడుకు తలగడనానుకుని కూర్చున్న తండ్రిని చూశాక, “ఆపరేషను గురించిన డెసిషన్ వెంటనే చెప్పాలంటున్నాడు డాక్టరు. ఆపరేషనైతే కావల్సిన మందులన్నీ బయటినుంచీ తెప్పించాలట. ఆపరేషన్ చేసే డాక్టరు దగ్గర యివ్వాళే అపాయింట్‌మెంట్ తీసుకోవాలట...” అన్నాడు కీచు గొంతుతో.

తాను తీసుకోలేని నిర్ణయాన్ని పేషంటుకే వదిలేసి తమాషా చూస్తున్నాడీ డాక్టరు. రిస్కు తనదిగాకుండా జాగ్రత్త పడుతున్నాడు. యిప్పుడు తన కొడుకూ, తన భార్యా గూడా రిస్కును తన కోర్టులోకే తోసేస్తున్నారని అతడి కర్థమైపోయింది. చిన్నప్పటి నుంచీ చాలా విషయాల్లో యితరు లేమంటున్నారని పట్టించుకోకుండా తనదైన నిర్ణయాల్ని తాను తీసుకున్నాడు. యెన్నెన్నో చాయిస్‌లు... యెన్నెన్నో నిర్ణయాలు. బియ్యేనా బీకామా? వుద్యోగమా, వ్యాపారమా? తల్లా, పెళ్లామా? పెళ్లామా, ప్రియురాలా? లాంటి గడ్డు ప్రశ్నలకే సులభమైన సమాధానాల్ని తెలుసుకున్న వాడతను. లైబ్రరీనా, సినిమానా? యిల్లా, క్లబ్బా? పుస్తకమా, మొబైలా? వంటి ప్రశ్నలను నల్లేరు మీద బండిలా దున్ని పారేసిన వాడతను. అయితే యిప్పుడెదురైన ప్రశ్న అలాంటిదిగాదు. తన శరీరంలో యేం జరుగుతూందో, యేం చేస్తే అదెలా స్పందిస్తుందో అతడికే తెలియదు. రిస్కెవరు తీసుకోవాలి?

*ఆపరేషను చేస్తే ఆయుస్సు పెరగనైనా పెరగాలి, లేకుంటే తగ్గనైనా తగ్గాలి. పోనీ మానేస్తే మంచీ జరగచ్చు, చెడూ రావచ్చు. రిస్క్ తనకొద్దని డాక్టరు జారుకున్నాడు. కొడుకూ, పెళ్లామూ చేతు లెత్తేశారు. యిప్పుడు నేనా నిర్ణయం తీసుకుంటే, మంచి జరిగితే, తనకు స్వేచ్ఛనిచ్చిన కీర్తి వాళ్లకే దక్కాలనీ, చెడు జరిగితే ఆ తప్పు తనపైకి తోసేసి, యే గిల్టూ లేకుండా, వూపిరి పీల్చుకోవాలనీ వాళ్ల ప్రయత్నం. అయినా యెవరేమనుకుంటారో ఆలోచించాల్సిన సమస్యా యిది! యిది నా జీవన్మరణ సమస్య. నేను మరికొంత యెక్కువకాలం బతుకు లాగాలి. అందుకు నేనిప్పుడేం చేయాలి?*

అతడి భార్యా, కొడుకూ బెంబేలు పడుతూ వచ్చి పిలవగానే డాక్టరు బెడ్ దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు. అతడప్పుడు పెద్దగా వూపిరి పీలుస్తున్నాడు. అతడి యెదరొమ్ము యెగసిపడుతోంది. అతడి కళ్లు మూతలు పడిపోయి వున్నాయి. కుదిపీ కుదిపీ, వూపీవూపీ అతడ్ని లేపడానికి ప్రయత్నించారు వాళ్లు. అతడు కళ్లు తెరవలేదు. అతడి ముఖంలోని చిడుముడిపాటులో మార్పేమీ రాలేదు.

డాక్టరు స్టెతస్కోపుతోనూ, బీపీ యంత్రంతోనూ అతడ్ని రకరకాలుగా పరీక్ష చేశాక, దిక్కులు తోచనట్టుగా బుర్ర గోక్కున్నాడు. పెద్దగా నిట్టూర్పు విడిచిపెడుతూ చివరికి, "ఆపరేషను గురించి వెంటనే డెసిషన్ చెప్పమన్నాంగదా! పేషంటు ఆపరేష నొద్దని గట్టిగా నిర్ణయం తీసుకున్నప్పుడే యిలా శరీరం స్పృహ తప్పుతుంది. రుజువు కావాలంటే వొక మార్గముంది. వొక యింజెక్షనిస్తాను. ఆయనా డెసిషన్ తీసుకున్నది నిజమైతే వెంటనే స్పృహ వస్తుంది," అన్నాడు డాక్టరు.

*నిర్ణయాన్ని కనిపించే యీ డాక్టరుకో, కనిపించని ఆ దుర్మార్గపు దేవుడికో వదిలేసి, స్మారకం లేనివాడిలా పడుకునేశాన్నేను. యిప్పుడీ డాక్టరేదో కొత్త యెత్తుగడలో వున్నాడు. యితను నిజంగా వైద్యం చేస్తున్నాడా? లేకపోతే నాతో ఆడుకుంటున్నాడా? నిర్ణయాన్ని నాకే వదిలిపెట్టి, రిస్కును నాకే వదిలేసి, నా ప్రాణాలతో చెలగాటమాడు తున్నాడా? లేకపోతే యెప్పుడో జరిగిన సంగతి జ్ఞాపకం పెట్టుకుని,*

*నాపైన కసి తీర్చుకుంటున్నాడా? యితడి జిత్తులకు నేను చిత్తయి పోవల్సిందేనా? లేదు. కుదరదు. నేనీ నాటకం కట్టిపెట్టి కళ్లు తెరిచేస్తాను.*

డాక్టరంత త్వరగా యింజెక్షను పొడిచేస్తాడని అతడి భార్యా, కొడుకూ అనుకోనేలేదు. పేషెంటు అదోలా కళ్లు తెరవబోయి, అంతలో యేదో లోయలోకి జారిపోతున్నట్టుగా, చీకటి మత్తులోకి కూరుకుపోయాడు.

“కళ్లు తెరిచాడు సార్!” అతడి భార్య గొల్లుమంది.

“మళ్లీ మూసేశాడు సార్!” అతడి కొడుకు యేడవబోయాడు.

డాక్టరు వాళ్లిద్దరికేసీ అదోలాంటి ఆందోళనతో చూశాడు. వాళ్లిద్దరి చూపుల్లో సందేహాలూ, ఆందోళనలూ ముట్టడి చేస్తున్నాయి.

“యిప్పుడున్న పరిస్థితిలో యింతకంటే స్పష్టంగా యింకెలా చెప్పగలడు?” అనేశాడు డాక్టరు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*19 సెప్టెంబర్ 2021*

❋




16 జులై 1957న పుట్టిన **మధురాంతకం నరేంద్ర** మొదటి కథ **చివరికి దొరికిన జవాబు** 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. కుంభమేళా, అస్తిత్వానికి అటూ-ఇటూ, రెండేళ్ల పద్నాలుగు, నాలుగుకాళ్ల మంటపం కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. కథావార్షికకు సహ సంపాదకులు. తాత్త్విక కథలు సంకలనానికి సంపాదకులు. ఆటా నవలల పోటీలో వీరి మనోధర్మపరాగం నవలకు మొదటి బహుమతి లభించింది. ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు.

***చిరునామా: 15-54/1, శ్రీ పద్మావతీ నగర్, తిరుపతి - 517 502***
***ఫోన్: 98662 43659*** *manarendra@gmail.com*